# 1

సాయంసమయం... ప్రశాంత వాతావరణం... మల్లె సుగంధాన్ని పూసుకున్న చల్లని గాలి- ఆవుద్యానవనంలో విహరిస్తోంది. రాజకుమారి రాగమతి వీణను మీటుతూ- సంగీతారాధన చేస్తోంది. ఆమెకంఠంలో మాధుర్యమూ, పాటలో తీయని భావమూ స్పష్టమౌతున్నాయి. అలసి పోయిన సూర్యభగవానుడు- అనుభవించిన అనుతాపాన్ని మరచిపోయి- ఆమె గానాన్ని ఆలకిస్తూ పశ్చిమాద్రికి పయ నిస్తున్నాడు. దూరంగా వున్న పొలాలలో పచ్చిక మేస్తున్న గోవులమంద, ఆకలిమరచి, తోకల నాడిస్తూ- పాటను వింటున్నాయి. ఆప్రశాంతవాతావరణానికి ఆమెపాట తీయని జోలపాటలా వుంది.

"వారు వస్తున్నారమ్మా"- పరిచారిక పిలుపుతో పాటను ఆపి, వీణను ప్రక్కనుంచి, తనకెదురుగా వస్తున్న ఆస్థానసంగీతవిద్వాంసుడు మదనుని ఆహ్వానించి- సింహాస నాన్ని చూపింది రాగమతి.

"అనుకోని అవాంతరాలు-ఆలస్యానికి కారణమయ్యాయి! క్షమార్హుడ్ని"- సింహాసనంపై కూర్చుంటూ తాను ఆల స్యంగా వచ్చి రాజకుమారి మనసు నొప్పించినందుకు క్షమార్పణ చెప్పుకున్నాడు మదనుడు.

"కేవలం మీవద్ద సంగీతాన్ని సాధనచేస్తున్న ఈ శిష్యురాల్ని- మీరు క్షమించమని కోరటం అపరాధం స్వామీ!" "అన్ని విధాలా దైవసమానులు మీరు!"- మదనుని పాదసన్నిధిని ఆసీనురాలయి, అతని పాదాలకు నమస్కరించింది రాగమతి.

నిశ్శబ్దవాహినిలో కాలం కొన్నిక్షణాలు తలదాచు కుంది... "ఈరోజు సంగీతసాధన చేయాలని మరచావా రాకుమారీ? మధ్యమావతిరాగాన్ని నీకీనాడు నేర్పుతానన్న సంగతి గుర్తులేదా"- అన్నాడు మదనుడు ప్రక్కనున్న వీణను తీసుకుంటూ.

"నాకు కావలసినవి ఆ'రాగాలు' కాదు స్వామీ! మీ అనురాగం" వీణను మీటుతున్న మదనుని చెయ్యి అప్రియత్నంగా ఆగిపోయింది. వీణ అపశ్రుతి పలికింది గర్జించినమేఘంలా!

"ఏం స్వామీ? మీ ప్రేమను పొందగోరేందుకు అర్హతలేని హీనురాలనా? లేక ఈ దీనురాలకు మీ హృద యంలో స్థానం కల్పిస్తే అది మాలిన్యమౌతుందా?"- నోట మాటరాక, ఖిన్నుడై శూన్యంలోకి చూస్తున్న మదనుని ప్రశ్నించింది రాగమతి.

"కాదు దేవీ కాదు! నిన్ను హీనురాలుగా పరిగ

ణించేటి మూర్ఖుడ్ని కాను నేను!... కానీ అందని పళ్ళకు ఆశించటం అవివేకమే అవుతుంది. నిజం దేవీ!. నిన్ను ఏక్షణాన చూశానో— అప్పుడే నీరూపాన్ని నాహృదయంలో— భద్రమైనచోట— చిత్రించుకొని— వలపుతలపులతో ఆరాధిస్తున్నాను... కానీ, నేనవరిని? కేవలం— కూటికోసం— నాపాటలతో సంగీతప్రియుల్ని మెప్పించి వారిచ్చే కాసులతో రోజులు గడుపుకొనే అదృష్టహీనుడ్ని— నాలోని సంగీత మధురిమను కనుగొన్న మహారాజులవారు— నన్నాదరించి— సాదరంతో ఆహ్వానించి— మోయలేనిబిరుదులతో— ఈ ఆస్థానానికే సంగీతవిద్వాంసునిగా నియమించారు. ఈ అలుసు చూచుకొని— రాజవంశంలో జనించి— ఏమహాసామ్రాజ్యానికో పట్టమహిషివి కావలసిన నిన్ను చేపట్టి మహారాజుల వారి ఆగ్రహానికి బలి కమ్మంటావా దేవీ?— అందుకే నా ఆశల్ను నిరాశలుగా చేసుకున్నాను.”

మదనుని హృదయంలో గూడుకట్టుకున్న బాధా, ఆవేదనా, అతని ప్రతిమాటలోనూ వినిపించాయి ఆమెకు!

“పవిత్రప్రేమకు కలిమిలేములు కారణాలవుతాయంటారా స్వామీ? భగవంతుడు మనల్ని కేవలమనుషులుగానే పుట్టిస్తాడు. జాతీ, మతమూ, కులమూ, గోత్రమూ— రాజరికం, పేదరికం— ఇవన్నీ మనం— మనుగడకోసం కల్పించుకున్నవే!”

రాగమతి మాటలలోని సత్యాన్ని మదనుడు అర్థంచేసుకో లేకపోలేదు.

"ప్రేమకు జాతిమతభేదాలు లేకున్నా- సంఘం వుంది దేవీ! అనుమానం కలిగితే- అన్యాయంగా- అమానుషంగా సంచరించే సంఘం అన్నివేళలా మనల్ని అనుసరిస్తూనే వుంటుంది. అదీకాక... ఒక్కగా నొక్కకుమార్తైన నీపైనే- ఆశల్నుంచుకొని- జీవిస్తున్న మహారాజుకు- నన్ను చేరదీసి- ఆదరించి- జీవితానికి ఒక అర్థాన్ని కలగచేసినందుకు ప్రతిఫలంగా- నిన్నే వరించి వివాహమాడితే వారికి ద్రోహం చేసినవాడిని కానా? అంతటి స్వామిద్రోహిని కాలేను దేవీ- కాలేను. నన్ను రెచ్చగొట్టకు"- ఆవేశంగా అన్నాడు మదనుడు. అతని ఆవేశానికి- అతనికి తెలియకుండానే- ప్రక్కనున్న లేతగులాబీమొక్క చివర్న పుష్పించబోతున్న మొదటిమొగ్గ బలిఅయిపోయింది.

"ముందుగానే మీలోని అశక్తినీ- అసమర్థతనూ చూడలేకపోయాను. మంచివారనుకున్నాను, మనసిచ్చాను. స్వర్గభాగ్యాలతో తులతూగే కాలంకోసం ఎదురుచూస్తున్నాను కానీ పరిస్థితులకూ, పరిసరాలకూ మీరు ఎదురుతిరగలేరు. మీసాన్నిహిత్యం లేకుండా- నేను ఈ కన్యాత్వాన్ని జీవితాంతం గడపలేను. కనీసం మీపాదాలచెంత కన్నుమూయటానికైనా అవకాశ ...."

"దేవి!..." పాదాలమీద వాలిపోయిన రాగమతి తల నిమురుతూ- తనవుత్తరీయంతో ఆమె అశ్రుపూరితనయనాలను వత్తాడు మదనుడు.

"పోనీయండి స్వామీ! నేనే- మీకు నామనసారా- మనసిచ్చివుంటే- వచ్చే జన్మకయినా మీ పాదదాసినవుతాను- అప్పుడయినా ఆభగవానుడు మీకు శక్తినీ, సామర్థ్యాన్ని ఇవ్వగలిగితే నాకోరిక తీరగలదు"- దుఃఖంతో కలసిన ఆమెమాటలు- మదనుని హృదయానికి సూటిగా నాటుకపోయాయి! తన సామర్థ్యలేమికి తానే దూషించుకున్నాడు. తనపైనే ఆశలుంచుకొని, తన సహచర్యం అనుభవించాలని ఆశించిన అబలను- తాను అనాదరణతో చూస్తూ, అన్యాయం చేస్తున్నందుకు బాధపడ్డాడు. మొదట ఏ అందాన్ని చూసి- ఆనందించి అనుభవించాలని ఆశపడ్డాడో- ఆ అందమే అనుబంధంకోసం అలమటిస్తూంటే- వెనుకాడటం అవివేకమేననుకున్నాడు. దెబ్బతిన్న అభిమానం- అతనిలోని శక్తికి- సామర్థ్యాన్ని ఇచ్చింది.

"అవసరంలేదు రాగమతీ! ఇకనుంచీ- కాదు- ఈక్షణంనుంచీ- ఈప్రకృతిమాత సాక్షిగా- నిన్ను నాఅర్థాంగిగా స్వీకరిస్తున్నాను... లే...!" మదనుని దృఢనిశ్చయానికి- అలవికాని ఆనందంతో ఆపాదమస్తకమూ పులకరించిపోయింది.

రాగమతి- దూరంగావున్న మామిడిచెట్టుక్రింద- చల్లని గాలికి- తనపింఛాన్ని విదిలించింది ఒక నెమలి. మరోమూలనున్న గులాబీమొక్క-చుట్టూ తిరుగుతున్న సీతాకోకచిలుక- ఒక్కసారిగా- మత్తుతో- ఆగులాబీపుష్పంలోనికి చొచ్చుకుపోయింది మకరందంకోసం!

వాలిపోయిన నేత్రాలను పైకి ఎత్తి- భయంలాంటి సిగ్గుతో-చూడలేక- మదనునివైపు చూసింది రాగమతి. అతని ఆత్మలోని విశ్వాసమూ, మాటల్లోని గంభీరతా, చూపులలోని నిశ్చయమూ- ఆమెకు గోచరమయినాయి.

అప్పుడప్పుడే చీకటి ఛాయలు అలుముకుంటున్నాయి- ప్రకృతిలోకి వచ్చిన చవితిచంద్రుడు తనకాంతిరేఖలు కనబడవనే స్వార్థచింతతో- తారకల మెరుపుల్ని మరుగుపరుస్తున్నాడు... గాలి రివ్వున వీస్తోంది. గూళ్లకు చేరుకున్న పక్షులు- బెంగపెట్టుకొన్న బిడ్డలను తమహృదయాలకు హత్తుకొని- తెచ్చిన ఆహారాన్ని ముక్కుకు అందిస్తున్నాయి.

"రెక్కలురాగానే- డొక్కకోసం తమదారిన తాముపోయే బిడ్డలపై వాటికి ఎంతప్రేమో చూశావా రాగమతీ! ఎదురుగుండా పొన్నాగచెట్టుమీదనున్న పక్షుల్ని చూపిస్తూ అడిగాడు మదనుడు.

ఎందుకో- సిగ్గుతో ఆమె బుగ్గలు ఎర్రనయినాయి! కను

రెప్పలు బరువుతో వాలిపోయినాయి. పెదవులు మాట్లాడలేక కంపించాయి... చందమామ ఎందుకో మబ్బులచాటుకు తప్పుకున్నాడు ఒకసారి. ఉద్యానవనాన్ని చీకటి బాగా అలుముకుంది.

## 2

ఋతువులు కాలక్రమంలో కలసిపోతున్నాయి. చల్లని వెన్నెల, నిండుపున్నమీ— రాగమతీ మదనులముందు సాగి పోతున్నాయి. కానీ కాలం ఎవ్వరికీ— ఒక్కతీరుగా గడవదు. పిల్లి కళ్లుమూసుక పాలుత్రాగినా— చూసినవారికి అది కనిపిస్తుంది. రాగమతీమదనులముందు అదే సామెత నిజమయింది. వారిప్రేమ మహారాజు మార్తాండునకు కంటకప్రాయ మయింది. రాజవంశంలో జన్మించి తనపూర్వులందరికీ తలవంపులు తెచ్చి, తనకు మాయనిమచ్చ కల్పించబోతున్న రాగమతిపై యున్న అనురాగాలు పటాపంచలయ్యాయి. అతని కోపజ్వాల మింటనంటింది. ఆవిషయం లోకానికి తెలిస్తే, తనపై ప్రజలకున్న గౌరవప్రతిష్టలు నశించిపోతా యేమోనని లోలోపలే బాధపడ్డాడు మార్తాండుడు.

ఏమైనా— తనగౌరవప్రతిష్ఠలకు ఒకవిధంగా చేటుతెస్తున్న మదనుని— సభికులందరి ఎదుటా అవమానపరచి తగినశిక్ష విధించాలనుకున్నాడు. తప్పంతా మదనునిపైకి త్రోసి

పుచ్చి- అందని పళ్ళకై ఆశిస్తూ ఉన్నతస్థితిలోవున్న రాజవంశంలోని రాకుమారిని వంచనతో మోహించి- రాజ్యానికే వారసుడు కావటానికి ఎత్తుగడ పన్నుతున్నట్లు అతనిపై నేరారోపణ చేసి- నలుగురిలో నగుబాటు చేయటానికే దృఢనిశ్చయుడైనాడు మహారాజు.

* * *

పాలుపోసి పెంచిన పాము- మిమ్మల్ని కాటెయ్యబోతే ఏంచేస్తారు మీరు? మన పామేకదా- మనమే పాలుపోసి పెంచామే- అనే ప్రేమతో ఊరుకుంటారా? కృతజ్ఞతతో పాలుపోసి పెంచినా- మీపట్ల కృతఘ్నురాలై మిమ్మే కరువబోయిన సర్పాన్ని చంపుతారా? ఏంచేస్తారు? నిశ్చలంగావున్న నిండుసభలోని సభ్యులను ప్రశ్నించాడు మహారాజు- గంభీరంగా!

మహారాజులోని ఉగ్రరూపాన్ని చూసిన ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు.

చూస్తూ చూస్తూ మరణాన్ని మనంతట మనం కొని తెచ్చుకోవటం అవివేకం మహారాజా! కాటేయకుండానే ఆపామును వ్రేటెయ్యాలి!” సభామధ్యంనుండి ఒక వృద్ధుడు లేచి సవినయంగా అన్నాడు.

"కూటికీ గుడ్డకూ గతిలేని ఒక అభాగ్యుని తెచ్చి-
అతనిలో చిగురిస్తున్న సంగీతప్రావీణ్యానికి ఒకరూపాన్ని
ఇవ్వాలని- బిరుదులతో పూజించి, మన ఆస్థానానికే విద్వాం
సునిగా నియమించినందుకు- ప్రతిఫలంగా మనరాజ్యానికీ-
మాపూర్వీకులకూ- కళంక మాపాదించబోతున్న మదనుడు
ఒకవిషసర్పమంటే మీరు ఏమంటారు?" మళ్లీ ప్రశ్నించాడు
మహారాజు ...

మహారాజుకు కుడిప్రక్కనున్న రాజగురువు, వేరొక
ప్రక్క నాసీనుడైన మహామంత్రి- ఆప్రశ్నకు తుళ్లి
పడ్డారు.

"అంతచేయరానిపని ఏమిచేశాడో మనవిచేస్తే మన్నిం
చటమో- మరేశిక్ష విధించటమో- మనవిచేస్తాం" రాజ
గురువు- ఠీవిగా- హుందాగా- ఒకసారి మహారాజువైపు
మరొకసారి ప్రజలవైపూ- చూసి- ప్రశ్నించాడు.

"ఏరత్నాన్ని చూసి మురిసిపోతూ- వంశోద్ధారకుడు
లేని చింతను మరచిపోగలుగుతున్నానో- ఆరత్నాన్నే అపహ
రించబోతున్నాడు మదనుడు. రాజకుమారిని సంగీతంలో
సామర్థ్యరాలినిగా చేయమని ఆదేశిస్తే- తనమాయలతో-
వంచనతో- ఆమెనే ప్రేమిస్తూ- బలవంతాన ఆమెను
చేపట్టి ఈసింహాసనానికే వారసు డవ్వాలనుకుంటున్నాడు-

చారులవల్ల ఈసంగతి తెలుసుకుని విలవిల్లిపోయాను. లేత హృదయ రాగమత్రిని- అనురాగమంటే తెలియని అమాయకురాలిని అన్యాయంగా అపహరిస్తే-మావంశమర్యాదలు, పరాకాష్ఠనందుకోవలసిన పరువుప్రతిష్ఠలూ- మట్టికావలసిన దేనా? మహావృక్షం కాకుండా- మొక్కగానే తుంచేయాలనుకున్నాను- దీనికి మీసమ్మతి కోరుతున్నాను"- మహారాజు మాటలకు సభంతా నిశ్శబ్దపూరితమైంది కొంతసేపు- ఆతరువాత మహామంత్రి లేచి సభికుల నుద్దేశించి అన్నాడు-

"మహాజనులారా! ఈసింహాసనం- గొప్పగొప్పమహారాజులకు ఆసనమై- మనల నందరనూ- కూటికీ గుడ్డకూ లోటురానీయకుండా కాపాడుతోంది. కానీ అన్నిటా అధముడూ అల్పుడూ అయిన ఒకసామాన్యుడు- ఈసింహాసనానికి వారసుడు కావటం మనలో ఎవరూ సహించకూడదు!"

"సహించం"- అని సభికులంతా కేకలు వేశారు.

"ఈనాడీ అత్యాచారం మనరాజ్యంలో జరిగింది. ఈనీచుడ్ని జాలిదలచి ఒదిలేస్తే ఎంతమందికన్యల కన్యాయం చేస్తాడో! కనుక మీరంతా తగిన శిక్షను శలవిస్తే- నేనే- రాజాజ్ఞతో- ఆశిక్ష నమలుపరుస్తాను." అన్నాడు మహామంత్రి ఉద్రేకంతో- ముందుకు వచ్చి.

"ఉరితీయండి! ఉరితీయండి"– సభికుల కంఠాలు మిన్ను ముట్టాయి.

మరికొన్ని నిముషాలకు– రాజాజ్ఞపై– మదనుని బంధించి తీసుకవచ్చి మార్తాండుని సమక్షంలో నిలబెట్టారు. ఆచారప్రకారం సభామర్యాదను గౌరవిస్తూ మహారాజు ముందు– వంగి– దండప్రణామం చేశాడు.

"కట్టిపెట్టు నీనక్క వినయాలు! ... ఈరాజద్రోహిని ఉరితీయండి"– గర్జించాడు మహారాజు. కోపంతో మహా రాజు కళ్లు నిప్పులు వర్షిస్తున్నాయి.

"ప్రపంచంలో– బ్రతకమని– భగవంతుడు సృష్టించిన ఒకజీవిని– మహారాజులవారు– కారణాలు లేకుండా వధించే టంతటి అవివేకులు కారనుకుంటాను... అయినా నాకు తెలి యని అపరాధమేదయినా జరిగివుంటే– ఆశిక్షే నాకు అర్హ మైనదైతే అనుభవించగలను"– మదనుని మాటలు వినయ పూర్వకంగా వున్నా– అవి మహారాజు కోపాన్ని మరింత రగిల్చాయి.

"ఉత్తమరాజవంశంలో జన్మించి– అంతకు మించి అంతస్థులున్న ఏమహాసామ్రాజ్యానికో 'చక్రవర్తిని' కావల సిన రాజకుమారి రాగమతిని– కూటికి గతిలేని నువ్– రాజ్య కాంక్షతో వంచించి– ప్రేమించటమే నీశిక్షకు కారణం"

అని రెండుక్షణాలు ఆగి "తీసుకపోండీవంచకుడ్ని! అమలు జరపండి ఉరిశిక్షని"– అని ఆఖరుసారిగా ఆజ్ఞాపించి– ఆనాటి సభను చాలించాడు మహారాజు మార్తాండుడు.

* * *

ఆనాటిరాత్రి– వికలమనస్కుడైన మహారాజుకు నిద్ర పట్టనేలేదు. అందచందాలు, కీర్తిసంపదలూ– బలపరాక్రమాలూ ఉన్న ఉత్తమరాజకుమారుడ్ని చూసి– రాగమతికి వైభవోపేతంగా వివాహం జరపాలని నిశ్చయించుకున్నాడు తను...గతించిన సంఘటనలు గుర్తుకు రావటంతో మహారాజు మనస్సు వికలమైపోయింది. వెంటనే స్వయంవరానికి తగు సన్నాహాలు జరపాలని నిశ్చయించుకున్నాడు. ఆలోచనలతో ఎప్పుడు నిద్ర కాహ్వానితుడయ్యాడో తనకే తెలియదు. కానీ మెలకువవచ్చేసరికి– సూర్యుని కిరణాల వేడిమి బాగా ఎక్కువయింది. అంతలోనే కోటనుండి– ఏడుగంటలు మ్రోగటం– వినిపించింది.

"తమకోసం మహామంత్రులు వేచి వున్నారు"– అన్నాడు అక్కడే వున్న ద్వారపాలకుడు. రాజాజ్ఞపై మరుక్షణంలో మహామంత్రి లోపలకు వచ్చి మహారాజుకు వందనం చేశాడు. విశేషమేమిటన్నట్లు చూశాడు మార్తాండుడు.

"మహారాజులవారి ఆజ్ఞప్రకారం- మదనుడ్ని ఉరి తీయించిన విషయం తెలపటానికి వచ్చాను." మహామంత్రి సవినయంగా అన్నాడు.

తుళ్ళిపడ్డాడు మహారాజు. గతస్మృతులు ఒకటొక్క-టిగా మహారాజు మస్తిష్కంలో మెరిశాయి. నాలుగు సంవత్సరాలుగా తన ఆస్థానంలో వుంటూ కోరినదే తడవుగా, తనగానమాధుర్యంతో సభికుల్ని ఆనందపారవశ్యుల్ని గావిస్తూ- తనకుమార్తెనుకూడా ఒక సంగీతవిద్వాంసురాలినిగా మలచిన మదనుడు ఉరితీయబడ్డాడనేసరికి భయకంపితుడయ్యాడు మహారాజు. పొరపాటున నోరుజారి- అదీ సభికుల అభిప్రాయాన్ననుసరించి- ఉరితీయమని ఆజ్ఞాపించాడు. మదనునిపట్ల తాను అన్యాయంగా ప్రవర్తించాడు. యావజ్జీవితకారాగారశిక్ష విధించివుంటే తరచు అతని గానామృతం చవిచూసే భాగ్యము కలిగేదేమో! ఎందుకో మార్తాండుని నయనాలు అశ్రుపూరితాలయినాయి. ఈఘోరవార్త విని- దూరంగా ఎక్కడో నివసిస్తూ- కుమారుని సంపాదనే ఆధారంగా జీవిస్తున్న- మదనుని తలిదండ్రులు ఎంతకుమిలిపోతారో? వారికి జీవనాధారమేమిటి? తనలోని క్రూరత్వానికి వారు దూషించరూ! ఎన్నో సంవత్సరాలనుండి తాను ప్రజాపాలన చేస్తూ ఒక్కరినైనా ఉరి

తీయమని ఆదేశించలేదు. ఎంతో మంచిమహారాజనీ, ధర్మ శాస్త్రకోవిదుడనీ- వేనోళ్ల తనను కీర్తించిన ప్రజలు ఇప్పుడు తనను దూషిస్తారు. అయినా కేవలం మదనునిది తప్పా? తన కుమార్తెకు భాగం లేదా? ఆమెను మన్నించి ఆమెసుఖం కోసం- ఒకఅభాగ్యుని ప్రాణాలు తీయటం ఉచితమేనా? అది తనస్వార్థం కాదా?"- మహారాజు ఆలోచనలు పరుగులెడుతున్నాయి.

"మహారాజా! రాజకుమారి కనిపించటంలేదు"- ఖంగారుగా వచ్చిన చెలికత్తె చేతులు జోడించి చెప్పింది. నిశ్చేష్టుడైపోయాడు మహారాజు. తనకాలికింద నేల కంపించి పోతున్నట్లు తలచాడు- వెంటనే ఏదో తీర్మానించుకొని- "మహామంత్రీ- పదండి!- వధ్యస్థలానికి రథాన్ని పోనివ్వండి- చివరిసారిగా మదనుని చూస్తాను. ప్రాణంతో లేకపోయినా- అతని భౌతిక దేహానికైనా కృతజ్ఞత లర్పిద్దాం. చేసిన మనతప్పును మన్నించమందాం!- పదండి"- అంటూ ఖంగారుగా మహామంత్రితో బయల్దేరాడు.

* * *

వసంతకాలపు ఉదయం కావటంవలన- అప్పుడప్పుడే ఎండ తీక్షణమవుతోంది- జోడుగుర్రాలరథం- అప్పుడే రాజ కోటను విడిచి వధ్యస్థలం చేరుకుంటోంది. మహారాజు

మార్తాండుడు రథంలో ఆసీనుడయ్యాడేకాని అతని మనసు ఎక్కడో విహరిస్తోంది. అశ్వాల నాధీనంలో వుంచుకొన్న మహామంత్రి గమ్యస్థానంకోసం ఎదురుచూస్తున్నాడు. గుర్రపుడెక్కల శబ్దానికి భయపడి, ఎండిపోయిన చెట్లకొమ్మల మీద వున్న గుడ్లగూబలు పారిపోతున్నాయి. గమ్యం చేరగానే రథాన్ని ఆపి క్రిందకు దిగాడు మహామంత్రి. మార్తాండుడు- మంత్రిని అనుసరించాడు- అది ఒక పెద్దమైదానం. చుట్టూ- కనుచూపుమేరలో ఎక్కడా పూరికొంపలయినా లేవు. మైదానానికి మధ్యలో పెద్ద ఎత్తయిన రాతికట్టడం ఒకటుంది. రాతిపైభాగాన మధ్యగా- శిక్షితుని తలను వుంచి- ఒకేకత్తివేటుతో ఆతలను మొండెంనుంచి వేరుచేసే పద్ధతి అమలులో వుండేది అప్పుడు. అదేప్రకారంగా మదనుడు వురితీయబడ్డాడు. ఆ బండరాతివద్దకు వచ్చిన మహారాజు మరణించిన మదనుని చూసి భయకంపితుడయ్యాడు. రాతికి— ఒకవైపున శిరస్సూ- వేరొకవైపున మొండెమూపడివున్నాయి. తలపై జుట్టు చెదిరిపోయివుంది. మెడనుండి రక్తం ఇంకా స్రవిస్తూనే వుంది. నేలమీదపడి వున్న ఆశిరస్సు చుట్టూ ప్రవహించిన ఎర్రని రక్తం సింధూరంలా మెరుస్తోంది.

“మహారాజా! రాజకుమారి !” కొంచెందూరంలో వున్న మహామంత్రి భయాందోళనలతో గట్టిగా అరచాడు.

అదిరిపడలేదు మహారాజు. అక్కడకు పదడుగులదూరంలో పడివున్న- జీవంలేని రాగమతిని చూశాడు. చేతి నున్న వజ్రాలవుంగరం చితికి- చెల్లాచెదరై వుంది. ఎడమ మణికట్టునుండి- పగిలిన గాజులు గుచ్చుకుని కాబోలు- రక్తం ధారలుగా ప్రవహించింది. ఎందుకో ఆదృశ్యం మార్తాండుని హృదయాన్ని కదిలించింది. అప్రయత్నంగా అశ్రుపూరితమయినాయి మహారాజు నేత్రాలు.

"మహామంత్రీ చూశావా ఈదృశ్యాలు! మంచి వాడూ- న్యాయాన్యాయవిచక్షణాదక్షుడూ- ధర్మశాస్త్ర కోవిదుడూ- అని మీరంతా అనుకుంటున్న- మహారాజు చేసిన ఘోరకృత్యాల్ని చూశావా? నవ్వు! నన్ను చూసి నవ్వు! ఏడుస్తున్న ఈమహారాజును చూసి- నిష్కృతిలేని పాపాన్ని మూటకట్టుకున్న నన్ను చూసి నవ్వమని ప్రజలకు చెప్పు! ... పవిత్రప్రేమికుల రక్తాన్ని కళ్ళచూడవలసి వచ్చింది మహామంత్రీ!" అంటూ దుఃఖించాడు మహారాజు. విషణ్ణవదనంతో తలవంచుకుని నిలుచున్నాడు మంత్రి- మాంసపుముద్దల్ని చూసి- ఆనందంతో- మంగళవాయిద్యాలుచేస్తున్నట్లు రొదచేస్తున్నాయి ఈగలు. అతని మొండెం నుండి మాంసపుకండల్ని తీసుకొని- దూరంగా లాక్కుపోయి- పీక్కుతింటున్నాయి రాబందులు. ఆదృశ్యం చూడలేక

ఒక్క నిముషం కనులు మూసుకున్నాడు మహారాజు. అతని లోని సంగీతమాధుర్యాన్ని కాలయమైన- అతని యావత్ శరీరాన్ని-జంతువులుపీక్కు తినటం చూడలేకపోయినాడు. ఉత్సాహంతో వురకలువేస్తూ- తమలో తాముగా ఏదో భాషలో మాట్లాడుతూ- ఆమాంసపుముద్దలోని రక్తాన్నే త్రాగుతున్నాయో లేక అందులో జీర్ణించివున్న సంగీతసాహిత్యాలనే పీలుస్తున్నవో తెలియలేదు మహారాజుకు. మదనుని నేత్రాలను వీక్షించిన మహారాజుకు "ఎంతతప్పుచేసినా నిన్ను మన్నిస్తున్నాను" అన్నట్లుగా గోచరించాయి. అక్కడ ప్రవహిస్తున్న రక్తాన్ని తీసి మదనునకూ- రాగమతికీ- తిలకం దిద్దాడు.

"మదనునకు తీరనిద్రోహంచేశాను మంత్రీ!" అన్నాడు మహారాజు- అశ్రుపూరితనయనాలను తన ఉత్తరీయంతో వత్తుకుంటూ! మహామంత్రి మౌనం వహించాడు.

"మహామంత్రీ! ఈపవిత్రప్రేమికులకు రాజలాంఛనాలతో దహనక్రియలు జరిపించేందుకు ఏర్పాట్లు చేయండి"- అన్నాడు మహారాజు రథంవైపు నడుస్తూ! ఎండ బాగా తీక్షణమయింది. వికలమైన మనస్సుతో- జోడుగుర్రాలరథం కోటవైపు నడిచింది.

——